# ఒక ఇరవై నాలుగు గంటలు

తూర్పున వెలుగు ఒళ్ళు విరుచుకునే వేళ - బయట ప్రపంచం నుంచి దోమలు బెడ్రూంలోకి ప్రవేశించే వేళ - ఫేను గాలి చలి చలిగా గిలిగింతలు పెడ్తూ 'మరికాస్సేపు పడుకో' అని జోలపాట పాడేవేళ - దిండు కింద మడతపెట్టిన పల్చని దుప్పటి ఒంటి నిండా పరుచుకుని దాని కింద శరీరాన్ని సౌకర్యమైన రీతిలో వుంచుకునే వేళ.... అర క్షణం నిద్ర, అర క్షణం మెలకువ - లేద్దామా? యింకా వద్దా అనే సందిగ్ధం.

దూరంగా గుళ్ళోంచి లలితా సహస్ర నామం. వంటింట్లోంచి గ్లాసుల గిన్నెల చప్పుళ్ళు... బాత్రూంలో నీళ్ళ ధార.... ఓవర్ హెడ్ టాంకులు నింపే ప్రయత్నంలో మోటార్లు చేసే రొద... అన్నీ... జలిమిగా... చైతన్యం ఒక్కసారి నిద్రలేచినట్టు -

"అమ్మా" అంటూ వాడి కేక.

ఎత్తుగా కట్టిన సరిహద్దు గోడ మీంచి గన్నేరూ, మామిడీ చెట్ల ఆకుల కొమ్మల మధ్య నించి - వేసివున్న బెడ్రూం కిటికీ రెక్కల సందుల్లోంచి - ఆ గొంతు. పరిచయమున్నదే - వాడికి ఆవిడ అమ్మ కాదు. పక్కింటి తలుపు తెరుచుకున్న చప్పుడు.

ఎంత దూరంలో వున్నా చప్పుళ్ళు ఎంతో దగ్గరగా -

"మొన్న రాలేదేం?" ఆవిడ ప్రశ్న పదునుగా. కరుకుగా.

"మొన్న తుపానుకి మా వూళ్ళో కొంపలు కూలి నష్టం బాగా జరిగిందని కబురొస్తేనూ..."

"వెళ్ళిన వాడివి మర్నాటికి రావాలి. ఒప్పు కొన్నాక ఎగ్గొట్టేస్తే ఎలాగ? ఆ రోజు నానేసిన బట్టలన్నీ పనమ్మాయి చేత ఉతికించాను. దానికి డబ్బులు లెక్కగట్టి నువ్వే యివ్వు..."

వాడికిది మామూలేలా - మౌనం.

"ఊరుకున్న వాణ్ణి వూరంతా కల్సినా ఏం చేయలేదట - ఇలాగైతే కుదర్దు. డబ్బులు చెట్లకి కాస్తున్నాయా?"

"చెప్పే ఎల్దామనుకున్నానమ్మా. కానీ రాత్రికి రాత్రే..." మాటలు ఫేడౌటౌయ్యాయి.

కళ్ళు అరమోడ్పులై... మాగన్ను.

"ఏమోయ్ ఇది విన్నావా? భూమి గుండ్రగా వుందన్నట్టు మళ్ళీ మొదటికే వచ్చింది మన విద్యా విధానం - పేపర్ లీకేజులూ, వీధికో పిండిమరలా తయారైన కోచింగ్ సెంటర్లూ ఇక వుండవు. ఎమ్‌సెట్ ఎత్తేసేరట!"

"ఇకనేం. గేటు బార్లా తెరిచేసినట్టే -"

"అదికాదు ఇంటర్లో మెరిట్ వారికే ఇంజనీరింగ్, మెడిసిన్ సీట్లట".

"చదువంటే ఆ రేండేనా? ఆ అభిప్రాయం పోయేవరకూ యీ విద్యా వ్యవస్థ యిలాగే..."

".... విద్యా వ్యవస్థ గురించి తర్వాత పగటి కలలు కందురుగాని, ముందు లేచి ఆఫీసుకు వెళ్ళే అవస్థలో పడండి" - శ్రీమతి తట్టి లేపుతోంది.

"కాస్సేపిలా ఉండనిద్దూ"

"పోనీ ఉండనిద్దామన్నా ఓంకార నాదంలా ఇల్లంతా మీ గురకతో ప్రతిధ్వనిస్తోంది. వార్తలు కూడా వస్తున్నాయి. లేవండి" దుప్పటి కాస్త తొలగించి వెళ్ళిపోయింది.

'మీ నాణ్యమైన స్థిరమైన గట్టి భవిష్యత్తు కోసం మా సిమ్మెంటునే...' ఏదో ఎడ్వర్టయిజుమెంటు కర్ణ కఠోరంగా - ఒకప్పుడు వార్తలు వినడానికి యింపుగా ఉండేవి. నిజంగా వార్తలే ప్రసారమయ్యేవి. ఇప్పుడన్నీ వార్తలే. మంత్రిగారి మౌనదీక్ష నించి మాజీ గవర్నర్‌గారి యిల్లు బాగుచేయించే ప్రయత్నం వరకూ అన్నీ వార్తలే - అన్ని గొంతులలోనూ వార్తలే - భాషాదోషాలతో... అపస్వరాలతో.. అన్నీ అన్నీ... మధ్యలో యిప్పుడు ఇవొకటీ -

వరదబాధితుల ఒక్కో కుటుంబానికీ లక్ష రూపాయలు - లారీ ప్రమాదంలో అశువులు బాసిన వారికీ లక్ష రూపాయలే - తుఫానులు... వరదలు... ప్రమాదాలూ... అందరికీ అక్షరాలా లక్ష రూపాయలే... ఆ రెండక్షరాల్లోని ఒక అక్షరమైనా బాధితుల కుటుంబాలకు చేరేనా?

"మళ్ళీ పడుకున్నారా?" అని శ్రీమతి మళ్ళీ అదిలింపు-

"ఇప్పుడొక ప్రకటన. ఆ తర్వాత టైముంటే మరి కొన్ని వార్తలు..." టీవీ కాబోలు! పిల్లలు లేచినట్లున్నారు. - వార్తల మధ్యలోనూ యీ కల్తీసరుకు గోల మన నెత్తిన రుద్దాలా?

'రుద్దుకుని చూడండి. మీ జుట్టు తళతళా. ...ఇందులో వెయ్యిన్నొక్క స్వచ్ఛమైన మూలికల రహస్య మేళవింపు వుంది. అది మీ జుట్టుకు ఎక్కడలేని స్వేచ్ఛనూ, మెరుపునూ, మైమరపునూ, పైపై మెరుపునూ....'

గుబుక్కున లేచి బాత్రూంలోకి జొరబడి తలుపులేసుకున్నా భరింపరాని ఆ గోల చెవుల్లో మార్మోగుతూనే వుంది.

చేతిలోకి తీసుకున్న మౌత్‌బ్రష్ వెనక్కు వాలి దంతక్షయాన్ని గురించి లెక్చర్లు దంచడం మొదలు పెట్టింది. దాని మెడలు వంచి పేస్టు వేసి నోట్లో పెట్టుకునేసర్కి తలప్రాణం మోకాలి కొచ్చింది.

మళ్ళీ మరో వార్త ముక్క లీలగా... 'నలభై ఏళ్ళుగా సాహితీ సేవ చేస్తూ అభ్యుదయ వాదిగా సంఘసంస్కర్తగా స్వాతంత్ర్య సమర యోధుడుగా ఘనతకెక్కిన కవి, రచయిత శ్రీ రమణకుమార్‌గారికి ప్రభుత్వం అవార్డు ప్రకటించింది.'

వివరాల కోసం బాత్రూం తలుపు ఓరగా తోశాను - అవార్డు కింద పది వేల రుపాయలూ, శాలువా, ప్రశంసా పత్రం; జ్ఞాపిక, సత్కారం - ఆనందం, విచారం మళ్ళీ మరో మారు. జలిమిగా. మనసంతా - ఆ గొప్ప రచయితను యిన్నాళ్ళకైనా గుర్తించినందుకు ఆనందమూ, ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాల కిచ్చే సొమ్ములో నాలుగో వంతు కూడా అవార్డు లేదే అని విచారమూ - దేశం కోసం, ప్రజల కోసం తన సర్వస్వాన్నీ

పంచి పెడుతున్న ఆ మహనీయునికి యీ ప్రశంసాపత్రాలూ, జ్ఞాపికలూ ఎంతవరకూ పనికొస్తాయో మరి! అంతకంటె ఆయన రచనలన్నీ జనానికి అందుబాట్లో వుండేట్టు ప్రచురిస్తే ఎంత బాగుంటుంది! ఊరూరా తిరిగి ప్రకటనలు సంపాదించుకుని తన రచనల్లో కొన్ని పుస్తకాలుగా ప్రచురించుకున్నారాయన. ఆయన పేదరికం తనకు తెల్సు-

ఆలోచనల మధ్యే నిత్య కార్యక్రమాలు... కాఫీ, షేవింగ్, న్యూస్ పేపరు పఠనం...

"ఇయ్యాల కాస్త డబ్బు సర్దాలమ్మా"

పక్కింట్లో బట్టలుతుకుతున్న చప్పుడు ఆగేక విన్పించాయా మాటలు

"ఎంతా?"

"అయిదొందలు"

"ఎందుకూ? పనిలేదేంటి?"

"మా అయ్యకి పంపాలమ్మా. పాక పూర్తిగా కూలిపోయింది"

"నీ మొహం! నువ్వేం యివ్వగలవ్. గవర్నమెంటు ఇస్తుందిలే"

"ఇస్తుందిగాని అదెప్పుడో. అందాక ఎక్కడుండాలి? ఏం తినాలి?"

"క్రితం నెల నువ్వు తీసుకున్న దాంతో రెండు వేలై పోయింది. ఎక్కడ్నించి తెచ్చి తీరుస్తావ్?"

"ఉతుకుతున్నా గదమ్మా"

"నీ మొహం ఉతుకూ నువ్వూనూ. బాగా ఉతకటం లేదు. పైగా నాగాలు.

"నా ఉతుక్కేమమ్మా. బట్టలు మల్లెపువ్వుల్లా వుంటేనూ. మీరు మా కష్టం చూడాల.

"ఏంటి చూసేదీ? కష్టంట కష్టం! సబ్బూ, నీళ్ళూ మావేనాయె. రోజూ ఓ అరగంట వచ్చి పోతావు. బాబుగారి బట్టలు యిస్త్రీ బాగా చెయ్యట్లేదు – మాదీ డబ్బే – వూరికే చెట్లకి కాయటం లేదు."

"నూర్రూపాయలకి యింటికొచ్చి యింత కంటె బాగా ఎవరుతుకుతారమ్మా. ఇస్త్రీ కూడా యింటికొచ్చే పావలా తక్కువకి చేస్తున్నాను."

"ఇస్త్రీ పెట్టె ఎలా వచ్చిందీ? మా డబ్బుతో కాదూ – ఈ గొడవ పడలేక మాన్పించేద్దామంటే నీ దగ్గర డబ్బుండి పోయిందాయె."

వాడేం మాట్లాడలేదు.

"సర్లే. మాటల్లోపడి బాదింపు తగ్గించేస్తున్నావ్. సరిగా బాదించు."

"నాల్గైదు నెలల్లో మీకాడ తీసుకున్నదంతా తీర్చేస్తానమ్మగారూ. ఈ మారు మాత్రం కాదనకండి."

"అప్పుడు మాత్రం? ఎక్కణ్నుంచి తెస్తావ్, మళ్ళీ అప్పేగా?

వాడి మౌనం -

"సర్లే తీర్చేద్దువుగాన్లే. నువ్వెక్కడికి పోతావ్. మేమెక్కడికి పోతాం. పాతది తీర్చేసి మళ్ళీ కొత్తగా తీసుకుందూగాని" – ఈ మారు అయ్యగారి గొంతు. పావురం వల నుంచి తప్పించుకుపోతుందేమోనన్న భయం?

"అలాగే బాబూ"

పావురం మాత్రం? గింజల కాశపడిందే గాని వల నించి తప్పించుకుపోవడం అంత సులువా?

"అవునుగానీ యీ మధ్య సినీమాలేం చూశావ్? మొన్న పండగ డబ్బులేవో పట్టు కెళ్ళేవ్. మీ అవిడని సినీమాకేనా తీస్కెళ్ళేవా లేదా?"

మళ్ళీ ఆవిడ గొంతు –

"తీసుకెళ్ళేనండమ్మగోరూ"

"వింటున్నారా వాళ్ళ మాటలూ" శ్రీమతి దగ్గరగా వచ్చి అడుగుతోంది.

"చెవుల్లో మార్మోగిపోతూంటే వినక ఛస్తానా?" అన్నాను.

"అదికాదు నేననేది – మనకి బట్టలు ఉతికినప్పుడు నూట యాభై రూపాయలిచ్చినా చాల్లేదని రోజూ సాధించేవాడు – ఇక్కడ మానేసి అక్కడ వంద రూపాయలకే జేరేడు. రోజూ అక్కడ చాకిరేవే! ఇస్త్రీ పెట్టె కనీ; రేడియో కనీ, సినీమాల కనీ అప్పులిచ్చి ఒకంతట తీర్చుకోలేనట్టు చేసేసి... సంవత్సరాల తరబడి చవగ్గా పనిచేయించుకోడం – ఎంత తెలివో చూశారా!"

"అప్పులూ... మనుషుల స్థితిగతుల్ని పెంచును – మీ అభిమాన.... దగ్గరే అప్పు తీసుకోండి. సరసమైన వడ్డీ... ట్రింగ్... ట్రింగ్..."

పేపరు ఓ మూలకి విసిరి, దిగ్గున లేచి బాత్రూంలోకి దూరేను.

కంపెనీకి ఏటా లక్షల్లో లాభాలార్జించే ఉద్యోగులూ, కార్మికులూ రెండు వేలమంది పైచిలుకే వున్నా వర్కర్లకి కంపెనీ బస్సుల్లేవు. రోజూ సిటీ బస్సుల కోసం నిరీక్షణ; పుట్ బోర్డు మీద ప్రయాణం. ఆలస్యమైతే పంచింగ్ క్లోజయి అరపూట సెలవూ – ఉద్యోగులకు క్వార్టర్స్ ఇవ్వలేని కంపెనీలకు విధిగా కంపెనీ బస్సులుండాలనే రూలుంటే ఎంత బావుణ్ణు!

"రెండు రోజులై కుళాయిలో నీళ్ళు రావటంలేదు – నీళ్ళు దిమ్మరించేసుకోకండి" శ్రీమతి అరుస్తోంది వంటింట్లోంచి.

వెధవ బతుక్కి అన్నీ పొదుపే – అర బకెట్ నీళ్ళతో స్నానం అయిందనిపించి బట్టలేసుకుని డైనింగ్ టేబిల్ దగ్గరకు చేరేను.

"కొట్టుకు ఛద్దాం రా" సినిమాలోనిదట

టీవీలో ఏదో రెండర్థాల పాట వస్తోంది. ఆధునిక గృహాలు మరి – ఫోంచేస్తున్నా ఎదురుగా టీవీ చూడాల్సిందే! తొడలపైకి వున్న పొట్టి గౌనుతో కాలేజీ స్టూడెంటు కాబోలు డాన్సు చేస్తోంది డజను మంది మందీమార్బలంతోనూ, బోయ్‌ఫ్రెండుతోనూ.

టీవీకి రిమోటుండాలని ఎవరు కనుక్కొన్నారోగాని నాలాంటివారికి మహోపకారం చేశారు.

రెడ్ బటన్ నొక్కేసర్కి హాయిగా, నిశ్శబ్దంగా... తింటున్నదేదో ఒంటబడుతున్నట్టు.

"సాయంకాలం కాలేజీ గ్రౌండ్స్‌లో గీతాసారం మీద స్వామీజీ ప్రసంగం ఉందట. వెళ్దామా?" అడుగుతోంది శ్రీమతి.

నిన్న సాయంకాలమే దర్శనమిచ్చాయా పోస్టర్స్. శిష్యుల, అనుచరుల బలగం ఎక్కువే వుంది స్వామీజీకి. పాదపూజలూ, గజారోహణలూ, యజ్ఞాలూ – వీటికి లోట్లేదు – స్వామీజీ ఏం చెప్పినా విషయం పల్చన చేసి పిట్టకథలతో పామర జనానికి ఎక్కేట్లు చెబుతారు.

దాంపత్య జీవితం మీద ఆయనకు అంత మంచి అభిప్రాయం ఉన్నట్లు కన్పించదాయన ప్రసంగాలు వింటే-

"నువ్వెళ్ళు" అని మరో మాటకు ఆస్కారమివ్వకుండా అక్కడ్నించి కదిలేను -

రెండు నిముషాలు కాలేదు. పెరట్లోంచి కెవ్వున కేక వినబడింది - అది శ్రీమతిదే -

"ఏమైందీ" అంటూ ఒక్క పరుగులో అక్కడికి జేరేను.

"చూడండి" అంటూ అటువైపు వేలు పెట్టి చూపించింది. ప్రహరీగోడ నానుకుని చచ్చి పడుంది ఓ బండ ఎలుక.

"పిల్లి తినలేక, పడేసి వుంటుంది. మా వూళ్ళో మా చిన్నప్పుడైతే ఒక్కొక్క పిల్లీ రెండేసి ఎలకల్ని తినేసి బ్రేవ్ మనేవి! కాలం మారింది- ఇప్పుడు ఎలకల్ని చూసి పిల్లి పారిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు" అన్నాను.

"చాల్లేండి జోకులు. అక్కడ పడేసింది పిల్లి. కాదు. మన పక్కింట్లోని మూడో వాటా వాళ్ళు" అంది.

"నీకెలా తెల్సు?"

"ఇంట్లో ఎలకలు ఎక్కువైపోయాయనీ. బోను పెట్టాలనీ నిన్న వాళ్ళు అనుకుంటూంటే విన్నాను."

"అయితే మాత్రం? అది వాళ్ళదే అని ఏమిటి?"

"ఏమో! నాకలా అన్పించింది."

"అయితే ఒక పనిచెయ్యి. దాన్ని గోడ మీంచి వాళ్ళ వాటా వైపు దాటించెయ్యి. ఆనక వాళ్ళూ, అదీ చూసుకుంటారు."

"బావుంది. కోరి జట్టీలు తెమ్మంటారా యింటి మీదికి?"

"పోనీ మన వీధి తుడిచే అతనొస్తాడుగా. అతగాడి చేత తీయించేయ్"

"బాగానే వుంది. ఇరవై రూపాయలిమ్మంటాడు."

"ఇరవైలూ పాతికలూ ఎందుగ్గానీ వూరికినే పట్టుకుపొమ్మను చాలు".

"మీకు హాస్యంగా వుంది వ్యవహారం. వారానికోరోజువచ్చినా డబ్బు యివ్వందే అటున్న కాగితం యిటు తుడవరు - దసరాకి మనం పాతిక రూపాయలే యిచ్చామని అందరి తొక్కులూ మనింటి ముందు పోగేసి మన అగ్గిపెట్టెతో మన ముందే అంటించి మనకే పొగ పెట్టేడు" అంది.

ఈ లోగా పనిపిల్ల పన్లోకి రావడంతో మా మాటలన్నీ వింటున్న మా చిన్న తమ్ముడు రంగంలోకొచ్చి, "మీరేం మాట్లాడకండి" అని మాతో చెప్పి దాన్ని పిలిచి-

"అదిగో ఆ గోడ వార అదేదో నిద్రపోతోందిలా వుంది. దాన్నా గోడ దాటించెద్దూ" అన్నాడు.

దానికేం అర్థం కాలేదు మొదట. తర్వాత గోడ దాకా వెళ్ళి చూసి, పరుగెత్తు కొచ్చేసి, "అమ్మో సచ్చింది" అంటూ కేక పెట్టింది.

"చచ్చిందాన్ని చూసి అంత కేకెందుకూ? కరుస్తుందా ఏమన్నానా? తీసి అవతల పారెయ్" అన్నాడు మా తమ్ముడు.

"నా నలాటి పని చెయ్యను - నా కసలే బయం" అందది.

ఈమారు మా శ్రీమతి అందుకుంది.

"అందరికీ అన్నీ సూకరాలే - పండగలకీ పబ్బాలకీ డబ్బులు కావాలి - పనులు చెయ్యమంటే మా వల్ల కాదంటారు. అపార్టుమెంటుల్లో వున్న వాళ్ళ బొచ్చుకుక్కల్నీ పిల్లి పిల్లల్నీ ఎత్తుకు తిప్పి అన్నాలు తినిపించి స్నానాలు చేయించగల్రు. అప్పుడుండదు భయం." అంది.

సరిగ్గా అప్పుడే "గేస్ అండీ" అంటూ వంటగేస్ సిలిండర్ తెచ్చిన అబ్బాయి కేకేసేడు వీధిలోంచి.

"పెరట్లోకి తెచ్చీ" అన్నాడు మా తమ్ముడు.

గేస్ తెచ్చిన కుర్రాడు సిలిండర్ పెరట్లోకి తెచ్చిపెట్టి వంటింట్లోని ఖాళీ సిలెండర్ బయటకు తెచ్చి నిండు సిలిండరు లోపల పెట్టాడు.

"ఏ బాబూ. దాన్ని కాస్త వీధిలో పడెయ్యవా" అంది మా పనిపిల్ల ఆ కుర్రాడితో.

"ఏటిదది?" అన్నాడతను చూడకండానే.

"చిన్నదే. బరువుండదులే" అందది. అని కాస్త నవ్వి; "కొంచెం పారెద్దూ నాకు బయం." అంది బతిమాలే ధోరణిలో.

నాకు నవ్వొచ్చినా ఆపుకున్నాను. ఏకళనున్నాడో ఆ కుర్రాడు చచ్చిన ఎలకను ఓ చెక్క మీది కెక్కించి అవతల పారేశాడు.

ఈలోగా ఖాళీ సిలిండర్ని దొర్లించుకెళ్ళి వీధిలో పెట్టేసింది పనిపిల్ల. దాని తెలివి తేటలకు ఆశ్చర్యమనిపించింది.

"మంచిదానివే - మా మంచిపని అప్పజెప్పినావ్" అన్నాడు వాడు దాంతో.

"మరికాదూ" అందది నవ్వుతూ.

గేస్ తెచ్చిన కుర్రాడు వెళ్ళిపోయాక, "మొత్తానికి వాడిచేత తీయించేశావ్. గడుసు దానివే" అంది మా ఆవిడ.

"మరి ఆడి పని కూడా. నే చేసి పెట్టేను గాదా" అందది నవ్వుతూ.

చిన్నముల్లు అరగంట క్రితమే తొమ్మిది మీంచి దాటేసింది.

పెద్దముల్లు ఆరు మీంచి దాటీ బోవడంతో నేను కూడా గుమ్మం దాటేశాను.

సాయంకాలం ఆరు గంటలకి బస్సుల్లో నలిగి వూసూరుమని వచ్చే వేళకి నా కోసమే చూస్తున్నట్టు "వెళ్ళమన్నారు. మరి వెళ్ళనా?" అంటూ ఎదురుగా నిలబడింది శ్రీమతి. కిక్కురుమనడానికి వీల్లేకుండా ఆమె చేతిలో వేడి వేడి కాఫీ వుంది.

"పిల్లల్ని చూసుకునే బాధ్యత కూడా మీదే"

మౌనం అర్థాంగీకారమైతే తల తాటించడం ముప్పావు అంగీకారం.

పిల్లల్ని ఎత్తుకోవాలా, ఆడించాలా? వాళ్ళ ఆటలు వాళ్ళవి - వాళ్ళ (సినీమా) పాటలు వాళ్ళవి!

ఏడున్నరకి ఇల్లు జేరి కాళ్ళు చేతులూ కడుక్కొని పుస్తకాలు తీసుకుని చెరో గదిలోకీ

వెళ్ళేరు. పొచెక్కిన పొద్దుటి పేపరు విసిరేసి టీవీ ఆన్ చేస్తే ఒక ఛానల్లో సినీమా(య)గోల. మరోదాన్లో చిత్రహింస. మాట్లాడేది తెలుగు మాటే అయినా పాడే పాట తెలుగుదే అయినా అర్థమైచావని డబ్బింగ్ సీరియల్సు మరికొన్నిట్లోనూ - అన్నిట్లోనూ అవే గొంతులు. మూడు వేల ఆరు వందలో ఎపిసోడట - జనం వెర్రివాళ్ళు. టీవీలు ధరలు పెరగొచ్చట - పేపర్లో వార్త. పదహారు వేల నించీ పాతిక వేల వరకూ - అన్ని వేలు పెట్టి కొనుక్కున్నది చూడకపోతే ఎలా?

సినీమా గోల మధ్యలో చదువు మూగ బోయినట్టయి చూద్దును గదా.... పిల్లలిద్దరూ చెరో గుమ్మంలోంచీ తొంగి చూస్తున్నారు టీవీ వంక.

"నీకే ఛానల్ కావాలమ్మా?" అడిగాను.

"నాకు అయిదు."

"నా కారు" అన్నారిద్దరూ ఏక కంఠంతో.

"ఛఫ్. నోర్మూసుకుని చదూకోండి. చదూకునే వేళ్ళల్లో యిలా టీవీ చూశారో రేపు ఏ బఠానీల వాడికో; ఉల్లిపాయల వాడికో టీవీని యిచ్చేస్తాను" బెదిరించేను.

చదువులు బలవంతంగా మొదలయ్యేయి -

వాడు ఏడూ; చంటిది ఐదూ - ఇంగ్లీషు మీడియం చదువులే. తెల్లారితే నాలుగు వేలొకరికీ; ఐదు వేలొకరికీ ఫీజులు కింద కట్టాలి. అలా ఏడాదికి రెండో మూడో టర్ములు - టెంత్ క్లాసు వరకూ శాయశక్తులా పెంచుకుంటూ - ఆ తర్వాత రెండేళ్ళు! ఇంటర్మీడియేట్ కమ్- కామనెంట్రన్స్. పేటకు రెండు కోచింగ్ సెంటర్లు - పది వేలో; పదిహేను వేలో; తర్వాత సీట్లొస్తే మళ్ళీ ముప్ఫయ్ వేలో; పాతిక వేలో - అన్నీ రూపాయలే! నాలుగేళ్ళలా కుంటుకుంటూ నడిస్తే పీజీలోకి గేటు - గేటుగాని అదృష్టవశాత్తూ తోసుకెళ్తే రెండేళ్ళ చదువు - తర్వాత ఏదో ఉద్యోగం వస్తే రావొచ్చు. గేటివతలే ఉండిపోతే నిరుద్యోగం ఎన్నేళ్ళో! పిల్లల భవిష్యత్ సోపానాలు! చదువుల గగన సీమలు!

"బాగానేవుంది సంబడం. సోఫాలో కూర్చునే నిద్రపోతున్నారా? పిల్లవెధవలిద్దరూ చదువుకుంటూనే పడుకున్నార్లావుంది. వాళ్ళ కింత అన్నం పెట్టి మీరూ తినెయ్యలేక పోయారా? నేనొచ్చే వరకూ పిల్లల బాధ్యత మీదేనంటే తలూపెట్టేరు మరి!"

ఆవిడగారొచ్చేసి చీర మార్చుకుంటూనే దండకం ఎత్తుకుంది.

"స్వామీజీ స్త్రీవాదం మీద గాని లెక్చరిచ్చే రేమిటీ" ఆవులిస్తూ అడిగేను.

"లెక్చర్లు విని అమలు జరపడమొక్కటే తక్కువైంది నాకు" సుడిగాలిలా వంటింట్లో కెళ్ళిపోయింది. వంటింట్లో కంచాలూ, గిన్నెలూ చప్పుళ్ళనంతరం భోజనాలు అయ్యే యనిపించేయి.

వీధి గుమ్మంలో కూర్చుని రాత్రి వెలగక; పగలు వెలిగే స్ట్రీట్‌లైట్ వంక చూశాను. గుడ్డి వెన్నెల లోకం నిండా-

అప్పుడు విన్పించింది. కాంపౌండ్ వాల్ మీంచి, పక్కింట్లోంచి ఆవిడ గొంతు.

"ఇంకా ఎంత పట్టుకెళతావ్? ఇప్పటికే వడ్డీతో కలిపి వెయ్యికి పైనే అయింది- నెల జీతం వంద చొప్పున ఎన్నాళ్ళు పట్టుకోగలను?"

రెండో గొంతులోంచి ఏదో జవాబు. తక్కువ స్థాయిలో – పనిమనిషి కాబోలు! ఏదో మాట్లాడుతోంది.

"జీతం పెంచను – నువ్వు చేసే పనికి అది చాల్లే. జీతాలూ పెంచి, అప్పులూ యివ్వడానికి ఇక్కడేం కూర్చోలేదు – ప్రతిపూటా మిగిలింది పెడుతూనే వున్నాను. హోటల్లో భోజనమెంతో తెల్సా? డబ్బులు చెట్టుకి కాయటం లేదు" అంటోందావిడ.

"ఈ మాటు మరి కాదనకండమ్మా. ఆపదొచ్చి అడుగుతున్నాను – మూడొందలేనా యిప్పించండి" అంటోందది సన్నగా, జాలిగా.

"చూద్దాం. బాబుగారితో చెబుతాను. పొద్దున్న వస్తావుగా" లొంగదీసుకోడంలోనూ మెళుకవలుంటాయి.

'కోటీశ్వరులెవరౌతారో చూద్దాం!' అంటూ టీవీలో సుప్రసిద్ధ నటుడు ఏంకర్‌గా జనాన్ని ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాడు– కోటీశ్వరుడు కావాలని ఎవరికుండదు?

రామాయణంలో రాముడికి శత్రుఘ్నుడేమౌతాడు? శూర్పణఖ అన్న పేరేంటి? వంటి ప్రశ్నలతో మహత్తరమైన ఆట! తెలివికీ, అదృష్టానికీ కాక మరి దేనికో పరీక్ష. జూదం లాంటి ఆట! కొంత డబ్బు రుచి చూపి, ముందుకెళ్తే కోటీ తప్పితే వైకుంఠపాళీలోని పెద్దపాము మింగినట్లు కిందికీ – అక్కడికి చాలించి ఆట ఆపితే ఎన్నో కొన్ని వేలు రూపాయలే! చెక్కుల రూపంలో!

కోటీశ్వర్లు కావాలనుకున్నవాళ్ళూ; టీవీలో ముఖం కన్పిస్తే చాలుననుకున్నవాళ్ళూ; నటుడితో కరచాలనం చేయాలనుకునే వాళ్ళూ... ఎందరో క్యూల్లో...

ఇంకా ఇంకా ప్రకటనలు – కోటీశ్వర్లు కావాలనుకునేవాళ్ళు ఫోన్లు చేసి పేర్లు నమోదు చేసుకోమని.

మంచం మీద మగతగా కళ్ళు మూతలు పడుతున్నాయి.

'హలో హలో.... పేర్రాసుకోండి... విశాఖ నించి పేరు...'

చప్పట్లు చప్పట్లు – వీధిలో మోళీ వేసే గారడీ వాళ్ళలా... గ్రహాలలో పెద్ద గ్రహమా? ప్రేక్షకుల సహాయం తీసుకుని చెబుతా – హమ్మయ్య గట్టెక్కినట్టే.

ఏమిచ్చి సేవకులను అత్యంత విధేయులుగా కట్టి పడేయవచ్చు?

ఎ) రోజూ తిండిపెట్టా బి) బట్ట యిచ్చా

సి) ఉంటానికి ఇల్లు యిచ్చా డి) అప్పులిచ్చా?

జవాబు తెల్సిపోయింది. ఎవర్నీ అడగక్క ర్లేదు –

డి) అప్పులిచ్చి – యస్. అదే కరక్టు. యస్. కాన్ఫిడెంట్.

ఆ ప్రశ్నతో కోటి రూపాయలు గెల్చుకున్నట్టే –

పాలవాడు కాబోలు గేటు కొడుతున్నాడు. అప్పుడే తెల్లారిందీ?

*మళ్ళీ మరో ఇరవై నాల్గుగంటలకు అంకురార్పణ జరిగినట్టే!!!*

*రచన – దీపావళి ప్రత్యేక సంచిక – నవంబర్, 2001*

*కథామహల్ – 2002 – వాహినీ బుక్‌ట్రస్ట్ – మే, 2002*